క్లుప్తంగా

ఈరన్నస్వామికి పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి వారి క్షేత్రంలో భక్తులతో సందడి నెల కొంది. అర్చకులు స్వామి వారి మూలవి రాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో వైఎస్సార్ సీపీ ఆదోని ఎస్సీ విభాగం అధ్యక్షుడు యేసేబు

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ ఆదోని ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా యేసేబును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు యేసేబు సోమవారం ఆదోనిలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి తనకు ఈ అవకాశం ఇచ్చిన వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని చెప్పారు.

విద్యార్థి మరణానికి బాధ్యులపై చర్యలు తీసుకోండి

ఆదోని సెంట్రల్: అనంతపురం నారాయణ కళాశాల విద్యార్థి మరణానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యు. దస్తగిరి కోరారు. సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. విద్యార్థుల మరణాలకు నారాయణ, భాష్యం పాఠశాలలు కేంద్ర బిందువులుగా మారాయని ఆరోపించారు. విద్యార్థి మరణానికి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే పురపాలక శాఖ మంత్రి నారాయణ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాల నివారణ కమిటీని ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్, మోహన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


3 నుంచి కడివెళ్లలో ఓపెన్ కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో పెద్దమ్మ, మారెమ్మ, చిన్నమ్మ అవ్వల దేవర మహోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 3 నుంచి ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు నరేంద్ర, విక్రం, శివాజీ, నాయుడు, సమర తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.10,016, రూ. 5,016, రూ.3,016 బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు వచ్చే నెల 3వ తేదీ లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 90591 19804, 93471 41794, 91608 01046 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి. వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనులు, పనితీరుపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి మంత్రాలయం నియోజకవర్గ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్నీ శాఖల అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మందకృష్ణకు పద్మశ్రీపై హర్షం



కోసిగిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోసిగి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగకు భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల కోసిగి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు చింతకుంట సామెల్, నరసింహులు, చిదానందులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కేక్ కట్ చేసి అభినందన సభ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రకాష్, ఈరన్న, నరసయ్య, రాజు,శివ రుద్రముని, దిలీప్ ఉన్నారు.

భారమనుకుంటే ప్రాణాలకే ముప్పు!

- రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ద్విచక్రవాహనదారులు
- హెల్మెట్ లేకపోవడమే ప్రధాన కారణం
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో కానరాని మార్పు
- మూడు సంవత్సరాల్లో 47 మంది చనిపోగా, 118 మందికి గాయాలు
- ఇంటి పెద్ద కోల్పోయి వీధిన పడుతున్న కుటుంబాలు



బనవాసి ఫారం వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరురూరల్: కొత్త సెల్ ఫోన్ కొంటూనే డిస్‌ప్లే ఎక్కడ పగిలిపోతుందోనని షాపు నుంచి బయటకు రాకముందే దానిపై స్క్రీన్ గార్డు వేయించుకుంటాం. అదే ద్విచక్రవాహనం నడిపేటప్పుడు ఏదైన ప్రమాదం జరిగితే ప్రాణపాయం నుంచి బయటపడేందుకు హెల్మెట్ కోనాలనే ప్రయత్నం చేయడం లేదు. ఒక్కసారి ఆలోచించాలి, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోతే రూ. కోట్లు ఇచ్చినా పోయిన ప్రాణాన్ని తిరిగి తెచ్చుకోలేం. ప్రాణరక్షణ కోసం తమ వంతు భాగంగా పోలీసులు రోడ్లపైకి వచ్చి స్పెషల్ డ్రైవ్, హైవే పెట్రోలింగ్, రోడ్డు సేఫ్టీ పేరుతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నా ప్రజల్లో మార్పు మాత్రం రావడం లేదు.

తనిఖీలు నిర్వహిస్తున్నా మార్పు సున్నా..

పట్టణం, రూరల్ పరిధిలో 2022 నుంచి 2024 వరకు దాదాపు 47 మందికి పైగా ప్రాణాలు కోల్పోతే, ఎక్కువ శాతం గాయాలపాలయ్యారు. ప్రమాదాల్లో ఎక్కువ ప్రాణాలు కోల్పోతున్నవారు హెల్మెట్ ధరించకపోవటం వల్లనేనని పోలీసులు చెపుతున్నారు. ప్రతి రోజు పోలీసులు ఏదో ఒక ప్రాంతంలో హెల్మెట్, డ్రంకెన్‌డ్రైవ్, కారు డ్రైవింగ్‌లో సీటు బెల్టు పెట్టుకోవాలని, కెపాసిటీకి మించి ప్రయాణికులు వెళ్లరాదని, నియంత్రణ కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. జాతీయ రహదారిలో రూరల్ పోలీసులు రోజులు తనిఖీలు నిర్వహిస్తూ, వాహనదారులకు, ఆటోలు, ఇతర వాహనదారులకు అవగాహన కలిస్తున్నారు. ఈ మధ్య కాలంలో పోలీసులు హెల్మెట్ పెట్టుకోని వారిపై జరిమానాలు విధిస్తున్నారు. కొందరిలో మార్పు వచ్చినా 90 శాతం మంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతేకాకుండా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తుండటంతో వేగంగా వెళ్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. పోలీసులు మైనర్లకు వాహనాలు ఇవ్వడంపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్స్ ఇస్తున్నా.. షరామాములే అన్నట్లు ఉంది.



హైవే రోడ్డు పక్కన విక్రయానికి ఉంచిన హెల్మెట్లు

2022, 2023, 2024 సంవత్సరాల్లో జరిగిన ప్రమాదాలు...

రూరల్‌లో: మండలంలో 2022లో 27 ప్రమాదాలు జరగగా వీటిలో 10 మంది చనిపోగా, 27 మందికి గాయాలు అయ్యాయి. 2023లో 21 ప్రమాదాలు జరిగితే 18 మంది చనిపోగా, 8 మందికి గాయపడ్డారు. 2024లో 12 ప్రమాదాలు జరగగా 8 మంది చనిపోతే, ఐదుగురు గాయాల బారిన పడ్డారు.

పట్టణంలో: పట్టణంలో 2022లో 22 ప్రమాదాలు జరగగా ఏడుగురు చనిపోయారు. 23 మందికి గాయాలు అయ్యాయి. 2023లో 17 ప్రమాదాలు జరగగా 8 మంది చనిపోతే 24 మంది గాయపడ్డారు. 2024లో 16 ప్రమాదాలు జరగగా ఆరుగురు మృతి చెందగా 21 మందికి గాయాలయ్యాయి.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తాం



తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు మోటార్ బైక్‌లు ఇస్తే కేసులు నమోదు చేస్తాం. హెల్మెట్ ధరించడం వలన లాభాలను, ప్రమాదాల నుంచి ఎలా బయట పడాలో అనేది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పట్టణంలో నిత్యం వాహనాలు తనిఖీలు చేస్తూ హెల్మెట్ ధరించాలని, లైసెన్సు కలిగి ఉండాలని వాహనారులకు అవగాహనలు కల్పిస్తున్నాం. పోలీస్ నిబంధనలను అతిక్రమిస్తే వాహదారులపై కేసులు నమోదు చేస్తాం.

– శ్రీనివాసులు, టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతూనే ఉన్నాయి. ప్రజల్లో చైతన్యం వచ్చేంత వరకూ ప్రమాదాలను నివారించటం కష్టతరం. ప్రతి ద్విచక్ర వాహనచోదకుడు హెల్మెట్ ధరించాలి, కారు నడిపే వ్యక్తి సీట్ బెల్టు పెట్టుకుంటే ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాలతో బయటపడవచ్చు. ప్రమాదాల్లో ఇంటి పెద్ద మృతి చెందితే ఆ కుటుంబాలు వీధిన పడాల్సివస్తుంది. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు కృషి చేస్తున్నాం.

– మధుసూదన్‌రావు, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్

ఈరన్న హంతకులను కఠినంగా శిక్షించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు

ఆదోని రూరల్: ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్‌గౌడ్, నాయకులు బొజ్జప్ప, గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మృతుడు ఈరన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగభద్రత కల్పించాలని, ఇప్పటివరకు తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నాగరాజ్, భీమలింగ, మల్లప్ప, జయప్ప, ఈరన్న, సురేంద్ర, రఘు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



పెద్దకబడబూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

ఎమ్మిగనూరుటౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి వుండాలని డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ సెక్యురిటీ, నేరాలపై కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ అధ్యక్షతన విద్యార్థులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. చాలా మంది తమ అకౌంట్లలో డబ్బు పోగొట్టుకొని మోసపోతున్నారని తెలిపారు. సమావేశంలో పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, సూపరింటెండెంట్ మద్దిలేటి,కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దకడబూరు : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. మండల పరిధిలోని హనుమాపురం గ్రామ సమీపంలో ఉన్న శ్రీ మహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ ఆధ్వర్యంలో సోమవారం సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలు పట్ల జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ టచ్ సెల్ ఫోన్ అందుబాటులో వచ్చినప్పటి నుంచి సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సులభంగా డబ్బులు సంపాదించాలన్న భ్రమలో సైబర్ నేరగాళ్ల భారిన పడి నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, కళాశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు



ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న ఎంఈఓ-2 శోభరాణి

కోసిగి: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించక పోతే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ-2 శోభరాణి హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం భవనంలో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో జాతీయ పండుగలు తప్పక నిర్వహించాలన్నారు. సంవత్సరంలో జరిగే జాతీయ పండుగలను పాఠశాలలో నిర్వహించకపోతే విద్యార్థులు ఏమి నేర్చుకుంటున్నారు. మండలంలోని ఓ పాఠశాలలో గణతంత్ర దినోత్సవం నిర్వహించకపోవడం దారుణమన్నారు. ఆ పాఠశాలకు నోటీసులు జారి చేసి చర్యలకు ఉన్నత అధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు పాఠశాల వేళలు, పాఠశాలలకు సెలవులు, పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ఫోర్జరీ సంతకంతో ఆస్తి కాజేసింది



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న హంపమ్మ

ఆదోని రూరల్: తమ పెద్ద కుమార్తె సరస్వతి ఫోర్జరీ సంతకాలు చేసి తమ ఆస్తిని కాజేసిందని తల్లి హంపమ్మ వాపోయింది. సోమవారం ఆమె స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద అధికారులకు జరిగిన విషయాన్ని తెలిపి న్యాయం చేయాలని వేడుకుంది. ఆదోనికి చెందిన వజ్రప్ప, హంపమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. ఇందులో పెద్ద కుమార్తె సరస్వతి ఆలూరు రోడ్డులోని సర్వేనంబర్ 169, 180, 173బిలో ఉన్న తన మూడున్నర ఎకరాల పొలాన్ని 2006లో తన భర్త వజ్రప్ప సంతకం ఫోర్జరీ సంతకం చేసి రిజిస్ట్రేషన్ చేసుకుందని హంపమ్మ వాపోయింది. 2009లో తన భర్త చనిపోయాడని, తన భర్త పేరుపై ఉన్న పొలాన్ని ఎవరికీ పంచి ఇవ్వలేదని పత్రాలను చూపింది. అయితే పెద్ద కుమార్తె ఫోర్జరీ సంతకంతో చేసుకున్న రిజిస్ట్రేషన్ రద్దు చేసి తన నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులకు సంబంధిత భూమిని సమానంగా అందేలా చూడాలని సబ్‌కలెక్టర్, తహసీల్దార్‌లను వేడుకుంది.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దానిని పాలకుల నుంచి రక్షించుకోవాలని కేవీపీఎస్ నాయకుడు సుమాల ఆంథోని పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆ సంఘ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో దళితులపై జరుగుతున్న సంఘటనలు తీవ్ర ఆందోళనలు కలిగిస్తున్నాయన్నారు. రాజ్యాంగాన్ని మనువాదులు తమకు అనుకూలంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు సుమాల రాజు, గుంటెప్ప, నాగరాజు, దావీదు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సంజీవయ్య నగర్‌లో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు గడ్డికి నిప్పంటుకోవటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. కాలనీకి చెందిన బరిగొర్ల వెంకటేష్ అనే వ్యక్తి తన పశువుల కోసం వేసుకున్న రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. మంటలను గమనించిన కాలనీ వాసులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. మంటలు అదుపుకాకపోవటంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో కొద్దిసేపటికి అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే వరిమేత పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ. 4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



సంగటి దావీదు(ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సంగటి దావీదు(58) ఆదివారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. గత ఎన్నికల్లో ఆయన వైఎస్సార్ సీపీ తరుపున ఎమ్మెల్యే గెలుపుకు కృషి చేశారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే తరుపున వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఎళ్లవేళల అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామ సర్పంచ్ రామాంజినేయులు, బీమా సేనా , ఈరన్న, సురేంద్ర, సుందరరాజు, జగదీష్, చిన్న గిడ్డయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి విడుదల చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిరుద్యోగ భృతి మంజూరు చేయాలని ఐపీవైఎల్ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా నేటికి ఇచ్చిన హామీలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లలో వేలాది రూపాయాలు వెచ్చించలేక నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యావ్యవస్థలో జీఓ నెంబర్ 117ను రద్దు చేయడం ద్వారా ఉత్పన్నమయ్యే విద్య, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, రాష్ట నాయకులు నాగరాజు, వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో సంఘ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యాసంవత్సరాలను ప్రామాణికంగా తీసుకొని ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని కోరారు. బదిలీలు కనిష్టంగా 2సంవత్సరాలు, గరిష్టంగా 8 సంవత్సరాల వ్యవధిని ప్రామాణికంగా తీసుకొని బదిలీలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు నాగరాజు, సుంకన్న, నాగేంద్రప్ప, సత్యనారాయణ, రామ్మోహన్‌రెడ్డి, మహమ్మద్‌షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వందశాతం వసూలుకు చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఆస్తి పన్ను వందశాతం వసూలుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. సోమవారం కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ఆస్తి పన్నులు చెల్లించాల్సిన ప్రజలు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభ్యున్నతికి సహకరించాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.6.50కోట్ల పన్నులు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటికే రూ.3.70కోట్ల మేర వసూలైందని, మిగిలిన రూ.2.50కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. అందులో ప్రభుత్వ పరమైన ఆస్తులకు సంబంధించిన పన్నులు అధికంగా వున్నాయని తెలిపారు. ప్రజలు మార్చి 31లోగా పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ అస్లాంబాషా, ఆర్ఐ పాల్గొన్నారు.

ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఆదోని అర్బన్: కులం పేరుతో దూషించారని కార్వన్‌పేటకు చెందిన మౌనేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరు గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సోమవారం త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపారు.షాహిద్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు ఐదుగురు కలిసి మౌనేష్‌ను కులం పేరుతో దూషించారన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి



డీఎస్పీ హేతలతకు వినతి పత్రం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆదోని అర్బన్: మైనర్ ర్యాష్ డ్రైవింగ్ రోడ్డు ప్రమాదాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ హేమలతకు రోటరీ క్లబ్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు న్యాయవాది జీవన్‌సింగ్ మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మైనర్ ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సౌండ్ పొల్యూషన్ డ్రైవింగ్‌లతో నిత్య ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రెవెన్యూ, పోలీసు, ఉన్నతాధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రమాదాల బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు సనత్, సునీల్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంప్రసాద్, భరత్, ప్రశాంత్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిని సత్కరిస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు, పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్సూర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టారంగయ్య, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అబ్రార్‌లు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

సమయానికి విద్యార్థి బస్సులు నడపండి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్ఎఫ్ నాయకులు

ఆదోని రూరల్: పల్లెల నుంచి ఆదోని పట్టణానికి చదువుకునేందుకు వస్తున్న విద్యార్థుల పాఠశాల, కళాశాలల సమయానికి బస్సులు నడపాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్, నవీన్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మా ట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల సమయవేళలకు బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విలేకరిపై కేసు నమోదు

ఆదోని రూరల్: మండల పరిధిలోని పాండవగల్లు గ్రామానికి చెందిన కె.వెంకటేష్ ఫిర్యాదు మేరకు విలేకరి ఎం.డి.నరసింహులపై పెదతుంబళం పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటేష్ తన ఫిర్యాదులో నరసింహులు తప్పుడు వార్తలు రాసి, బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేశాడని పేర్కొన్నాడు. బాధితుడు మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేసిన తనపై నరసింహులు లేనిపోని ఆరోపణలు చేసి, తన ఉద్యోగం కోల్పోయేలా చేశాడని ఆరోపించాడు. నరసింహులు ఎస్సీ కులాన్ని అడ్డుగా పెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయాడు. ఈ వ్యవహారాన్ని జిల్లా ఎస్పీ వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినిపించిన తర్వాత, ఆయన ఆదేశాల మేరకు పెద్దదతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ నరసింహులపై కేసు నమోదు చేశారని తెలిపారు. ఇటీవల ఈయనపై ఆదోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు నమోదయ్యింది.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

పెద్దకడబూరు : స్థానిక రెయిన్‌బో ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ గోవిందరెడ్డి తెలిపారు. జూడో రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులు షౌకత్ అలి, అమరేష్, శివలీలలకు ప్రశంసా పత్రాలను సోమవారం అందించారు.

అంతా ఆయనకే సంబంధం.. మనకెందుకు!



సబ్‌కలెక్టర్ ప్రజా సమస్యలు వింటుండగా సెల్‌ఫోన్‌లో నిమగ్నమైన అధికారులు

- ప్రజాసమస్యలు పట్టని డివిజన్ స్థాయి అధికారులు
- ప్రజాసమస్యలో పరిష్కారవేదికలో సెల్‌ఫోన్ చూస్తూ, నిద్రపోతూ కాలక్షేపం
- భారమంతా సబ్‌కలెక్టర్‌పైనే

ఆదోని రూరల్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స రెడ్రెసియల్ సిస్టం–పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తోంది. దీంతో ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎన్నో ఆశలు పెట్టుకుని వచ్చి కార్యాలయాలకు వచ్చి అర్జీలను సమర్పించి వెళ్తున్నారు. అయితే ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ భవనంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్‌కలెక్టర్ మౌర్యా భరద్వాజ్ ప్రజా సమస్యలను ఎంతో ఆసక్తిగా పరిశీలిస్తుండగా, సంబంధిత డివిజన్ స్థాయి అధికారులు మాత్రం తమకు ఏమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తూ.. సెల్‌ఫోన్‌లలో నిమగ్నమై, మరి కొంతమంది నిద్రపోతూ కాలక్షేపం చేస్తున్నారు. ప్రతి వారం వీరిది ఇదే తీరు. ఈ దృశ్యాలను చూసి సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజలు బయటకు వచ్చి అధికారుల తీరుపై పలురకాలుగా చర్చించుకున్నారు. మరి కొంత మంది నెలలు, వారాలు తరబడి తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పరిష్కారంకాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంపై దృష్టి సారించి, ప్రజా సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని కోరుతున్నారు.